సాక్షి నంద్యాల

గురువారం । 5 । జనవరి । 2023



అప్రమత్తతే ఆయుధం

ఎమ్మిగనూరురూరల్: విపత్తుల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బుధవారం బనవాసి నవోదయ విద్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



సింగోటం పిలుస్తోంది!

తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లాలో సింగోటం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా నుంచి భక్తులు తరలివెళ్లనున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,623.91
టీఎంసీల సామర్థ్యం	:105,788
ప్రస్తుతం	:72,982
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,551

న్యూస్‌రీల్

నీటి విడుదల కొనసాగింపు



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి విడుదలవుతున్న నీరు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. తెలుగుగంగ, జీఎన్‌ఎస్‌ఎస్, కేసీ ఎస్కేప్ కాల్వల పరిధిలో రిజర్వాయర్లు గరిష్టస్థాయి నీటిమట్టంతో ఉన్నాయి. దీంతో ఎస్సార్‌ఎమ్సీలోకి 2 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

వీబీఆర్ నుంచి 1,540 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో

వెలుగోడు: తెలుగుగంగ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 1,540 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శివనాయక్ తెలిపారు. బుధవారం వన్‌ఆర్ తూము నుంచి 60 క్యూసెక్కులు, వన్‌ఎల్ తూము నుంచి 30, మద్రాస్ కాల్వకు 1,300 క్యూసెక్కులు, స్లూస్‌ద్వారా 90 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. వీబీఆర్‌కు ఎలాంటి ఇన్‌ఫ్లో లేదని వెల్లడించారు. ప్రస్తుతం జలాశయంలో 13.359 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ తెలిపారు.

గర్భిణికి కరోనా పాజిటివ్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణానికి చెందిన ఓ గర్భిణి కరోనా బారిన పడింది. నూనెపల్లి వీధికి చెందిన ఓ గర్భిణికి తీవ్ర జ్వరం, జలుబు ఉండటంతో స్థానిక సర్వజన ఆసుపత్రిలో చేరింది. అయితే వైద్యులు కరోనా లక్షణాలుగా అనుమానించి పరీక్ష చేయడంతో బుధవారం పాజిటివ్‌గా తేలింది. దీంతో ఆమెను హోమ్ ఐసోలేషన్‌కు తరలించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

గడివేముల: ఆరోగ్యశాఖలోని ప్రతి ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ సూచించారు. మండల కేంద్రమైన గడివేములలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీలోని రికార్డులు, ల్యాబ్, మందులు, కాన్పుల గదిని పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జబీన్‌ను ఆదేశించారు.

ఖేలో ఇండియాలో నమోదుకు అవకాశం

నంద్యాల(సిటీ): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లోని ప్రిన్సిపాల్, హెడ్‌మాస్టర్లు ఈ నెల 25వ తేదీలోపు ఖేలో ఇండియా వెబ్‌సైట్‌లో తమ పాఠశాల విద్యార్థుల వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నమోదు పూర్తయిన తరువాత ఖేలో ఇండియా (స్కూల్ వర్షన్) యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసి అందులో పీఈటీ/ఎస్‌ఏ రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతించం

కర్నూలు(లీగల్): ఈనెల 7వ తేదీన జరగనున్న జూనియర్ సివిల్ జడ్జి రాత పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశించిన సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు చేరుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకంగా ఏపీ హైకోర్టు అత్యంత కట్టుదిట్టంగా పరీక్ష నిర్వహిస్తోందని తెలిపారు.

సీఐడీ ఎస్‌పీపీగా నాగలక్ష్మీదేవి

కర్నూలు(లీగల్): సీనియర్ న్యాయవాది వి.నాగలక్ష్మీదేవిని క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఎస్‌పీపీ)గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె మూడేళ్లపాటు సీఐడీ పోలీసులకు న్యాయ సహాయం చేస్తారు. ఇందుకు నెలకు రూ.40 వేల గౌరవ వేతనం అందుతుంది. నాగలక్ష్మీదేవి గతంలో రెండు పర్యాయాలు అదనపు పీపీగా విధులు నిర్వహించారు.

పోలియో వ్యాక్సిన్ ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో చిన్నారులు పోలియో బారిన పడకుండా ఉండేందుకు గాను ఇంజెక్టబుల్ పోలియో వ్యాక్సిన్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ వ్యాక్సిన్‌ను 4 వారాలు, 6 వారాలతో పాటు 9వ నెలలో మీజిల్స్, రుబెల్లా టీకాతో పాటు చిన్నారులకు ఇవ్వనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య తెలిపారు. ఇది చిన్నారులు పోలియోబారిన పడకుండా పటిష్టమైన రక్షణ వ్యవస్థగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.

క్షేమంగా గమ్యానికి చేరేలా..



జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి నిద్ర మత్తులో జరుగుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు వాహన డ్రైవర్లకు నీళ్లు ఇచ్చి ముఖం శుభ్రం చేసుకోవాలని సూచిస్తారు. కొంత సేపు అక్కడే సేదతీరమని చెప్పి డ్రైవర్‌ను కూర్చోబెడతారు. ప్రయాణించే మార్గంలో ప్రమాదాలకు ఆస్కారం ఉండే ప్రాంతాలను వివరించి హెచ్చరించి పంపుతున్నారు.

నిఘాకు చిక్కారు..



నిఘా పెంపొందించేందుకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, రాత్రి గస్తీ ముమ్మరం చేయటంతో వాహనాల దొంగలకు అడ్డుకట్ట పడింది. రాత్రి గస్తీల్లో పట్టుబడిన అనుమానితులను విచారించగా బైక్ చోరీలు వెలుగులోకి రావడంతో 90 బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే గత నెల 5వ తేదీ రూ. 20 లక్షల విలువ చేసే ఆరు రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాలు, 18 స్కూటీలు, 1 బొలేరో వాహనాన్ని గుర్తించి దొంగలను రిమాండ్‌కు పంపారు.

అక్రమ కిక్కు వదిలేలా..



జిల్లాలో మద్యం, నాటుసారా అక్రమ రవాణాను అడ్డుకునేందుకు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపడుతున్నారు. గత ఏడాది జూలై 28 తేదీన జిల్లాలో వివిధ ప్రాంతాల్లో స్వాధీనం చేసుకున్న రూ.1,21,62,000 విలువ చేసే మద్యాన్ని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి అయ్యలూరు మెట్ట వద్ద రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు.

వణుకు పుట్టిస్తూ.. నిఘా పెంచుతూ!

- నేరాల కట్టడికి పోలీసుల పకడ్బందీ వ్యూహం
- కానిస్టేబుల్ హత్యానంతరం నిఘా తీవ్రం
- 14 మంది రౌడీషీటర్లపై పీడీ యాక్ట్
- ల్యాండ్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట
- సత్ఫలితాలిస్తున్న 'ఆపరేషన్ పరివర్తన్ 2.0'

బొమ్మలసత్రం: శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఓ వైపు రౌడీషీటర్లకు అడ్డుకట్ట వేస్తూ.. మరో వైపు ల్యాండ్ మాఫియా ఆటకట్టిస్తోంది. జిల్లా ఎస్పీ రఘువీర్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు పక్కా ప్రణాళికతో నేరాలకు చెక్ పెడుతున్నారు. నూతన జిల్లా నంద్యాలలో నేరాల నియంత్రణకు పోలీసులు చేపట్టిన చర్యలను ప్రజలు హర్షిస్తున్నారు. పలు నేరాల్లో నిందితులకు శిక్ష పడేందుకు తగిన ఆధారాలు సేకరిస్తున్నారు. అలాగే సారా, గుట్కా, ఇతర రాష్ట్రాల మద్యం, రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రమాదాల నివారణకు స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాత్రి గస్తీ ముమ్మరం చేసి చోరీలను అడ్డుకుంటున్నారు.

ఆదిలోనే అడ్డుకట్ట..

గత ఏడాది ఏప్రిల్ నెలలో ఆవిర్భవించిన నూతన నంద్యాల జిల్లాకు మొదటి ఎస్పీగా కె.రఘువీర్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. నూతన జిల్లా కావడంతో పోలీస్ శాఖలోని వివిధ విభాగాల కార్యాలయాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, వసతి తదితర పనుల్లో ఉన్నతాధికారులు తలమునకలయ్యారు. ఇదే అదునుగా కొందరు రౌడీషీటర్లు సెటిల్‌మెంట్ దందాలకు తెరలేపారు. ఆగస్టు 7వ తేదీ రాత్రి 9 గంటలకు కానిస్టేబుల్ సురేంద్రనాథ్‌ను ఆరుగురు రౌడీషీటర్లు జిల్లా కేంద్రం నడిబొడ్డులో కత్తులతో వెంటాడి అందరూ చూస్తుండగానే అతికిరాతంగా హత్య చేశారు. అప్పటి వరకు చిన్న చిన్న సంఘటనలు జరుగుతున్నా తాత్సారం చేసిన పోలీసు శాఖ కానిస్టేబుల్ హత్యతో నేరగాళ్లపై కన్నెర్ర చేసింది. హత్య కేసులో నిందితులను రిమాండ్‌కు తరలించిన తర్వాత పాత నేరస్తుల చరిత్రను బయటికి తీసింది. కొంత కాలంగా జిల్లాలో సమస్యాత్మక ఘటనలకు పాల్పడుతున్న 10 మంది రౌడీషీటర్లపై పోలీసు అధికారులు పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపారు. అప్పటి నుంచి మిగతా రౌడీషీటర్లు ఇతర ప్రాంతాలకు వెళ్లి తలదాచుకున్నారు. ఇదే క్రమంలో కానిస్టేబుల్ హత్యకేసులో నలుగురు నిందితులకు బెయిల్ మంజూరు కాక ముందే పీడీ యాక్ట్ నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు పంపారు. దీంతో మరో ఏడాది వరకు నిందితులు బయటికి వచ్చే అవకాశం లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు.



చోరీకి గురైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)

నాటుసారాపై ఉక్కు పాదం...

రాష్ట్ర ప్రభుత్వం నాటుసారా నిర్మూలన కోసం చేపట్టిన ఆపరేషన్ పరివర్తన్ 2.0 కార్యక్రమాన్ని జిల్లాలో నిరంతరం అమలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పీడీ యాక్ట్‌లు, బైండోవర్ కేసులు నమోదు చేశారు. జిల్లాగా ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు 75,91,106 లీటర్ల సారా ధ్వంసం చేశారు. జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా దాడులు చేపట్టి 2,289 కేసులు నమోదు చేసి 2,492 మందిని అరెస్ట్ చేశారు. సారా రవాణాకు ఉపయోగించిన 270 వాహనాలను సీజ్ చేయటమే కాకుండా 744 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. కొన్నేళ్లుగా కుటుంబ పోషణ కోసం సారా తయారీనే ఉపాధిగా మార్చుకున్న 32 మందిని గుర్తించి చిరు వ్యాపారాలు చేసుకునేందుకు రూ. 35 లక్షలు ప్రభుత్వం నుంచి అందించారు.

నైట్ బీట్ వ్యవస్థలో మార్పులు....

కొంత కాలంగా పోలీసులు అనుసరిస్తున్న నైట్ బీట్ వ్యవస్థను జిల్లా ఎస్పీ సమర్థవంతంగా అమలయ్యేలా మార్పులు తీసుకొచ్చారు. రాత్రి సమయాల్లో గస్తీని పరిశీలించేందుకు జిల్లా వ్యాప్తంగా ఆరుగురు డీఎస్పీ స్థాయి అధికారులను నియమించారు. నిరంతరం సీసీ కెమెరాల ద్వారా నేరగాళ్ల గుర్తింపు కోసం ప్రత్యేకంగా క్రైమ్ పార్టీ పోలీసులకు విధులు కేటాయించారు. 10 మంది సీఐలు, 18 మంది ఎస్‌ఐలు నైట్ బీట్‌కు వెళ్లి నిరంతరం తనిఖీ చేస్తున్నారు. గస్తీ ముమ్మరం కావడంతో రెండు నెలల క్రితం ముగ్గురు అంతరాష్ట్ర దొంగల ముఠా పట్టుబడ్డారు. వారి నుంచి 1.50 కేజీల బంగారు ఆభరణాలు, రూ. 5.75 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు చైన్ స్నాచర్ల ఆట కట్టించారు.

శాంతిభద్రతలే ధ్యేయం



జిల్లాలో శాంతిభద్రతలు రక్షించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. జిల్లాలో రౌడీయిజాన్ని సహించే ప్రసక్తే లేదు. జిల్లాలో ప్రశాంత వాతావరణానికి భంగం కల్గిస్తే ఎంతటి వారినైనా శిక్షిస్తాం. భూముల ఆక్రమణదారుల్లో కొందరిని ఇప్పటికే జైలుకు పంపాం. కబ్జాలకు పాల్పడిన వారిపై బాధితులు ఫిర్యాదు చేస్తే భూములకు రక్షణ కల్పిస్తాం.

– కె.రఘువీర్‌రెడ్డి, నంద్యాల జిల్లా ఎస్పీ

పర్యాటకులు పులికించారు

- భైర్లూటీ జంగిల్ సఫారీలో రెండు పెద్ద పులుల సందర్శన
- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్



నల్లమలలో జంట పులులు (ఫైల్)

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని భైర్లూటీ ఎకో - టూరిజం జంగిల్ క్యాంప్ పర్యాటకులకు ఒకేసారి జంట పులులు కనిపించడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. ఎకో - టూరిజం రిసార్ట్‌లో బస చేసిన పర్యాటకులు మంగళవారం ఉదయం నాగలూటి అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సందర్శన కోసం జంగిల్ సఫారీ వెళ్లారు. వీరికి నాగలూటి వీరభద్రాలయం సమీపంలో రెండు పులులు ఒకేసారి కనిపించాయి. సాధారణంగా జంగిల్ సఫారీకి వెళ్లే పర్యాటకులకు దుప్పులు, కణుతులు, రేచు కుక్కలు తరుచూ కనిపిస్తుంటాయి. పెద్దపులి, చిరుత పులుల వంటి ప్రధాన మాంసాహార వన్యప్రాణుల సందర్శన అరుదుగా ఉంటుంది. అందుకే ఒకేసారి కనిపించిన రెండు పెద్దపులులను చూసి పర్యాటకులు కేరింతలు కొట్టారు. వాటిని వీడియోల్లో బంధించే ప్రయత్నం చేశారు. 'అబ్బా పెద్దపులి... ఒకటి కాదు రెండు ... చూడుచూడు' అంటూ పర్యాటకులు చేసిన సందడి వీడియోలో స్పష్టంగా వినిపించింది. ఈ వీడియోలను ఆ పర్యాటకులు సామాజిక మాధ్యమాల్లో అప్ లోడ్ చేయగా బుధవారం వైరల్ అయ్యాయి. ఈ సంఘటన నల్లమలలో పెరుగుతున్న పులుల సాంద్రతను సూచిస్తుందని పర్యావరణ, వన్యప్రాణి ప్రేమికులు భావిస్తున్నారు.

ఉగాదిలోగా ఐదు లక్షల గృహాలు నిర్మించండి

- జగనన్న లే అవుట్లలో వసతులు కల్పించండి
- గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి
- అధికారులకు కలెక్టర్ మనజీర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల(అర్బన్): జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో బుధవారం గృహ నిర్మాణాల పురోగతిపై జేసీ నిశాంతితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఉగాది నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల గృహాలను పూర్తిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని, ఈ మేరకు హౌసింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని 259 జగనన్న లే అవుట్లలోని మొత్తం 44,339 ఇళ్ల మంజూరు కాగా ఇప్పటి వరకు 24,362 గృహాలు గ్రౌండింగ్ అయ్యాయన్నారు. 8,018 గృహాలు బేస్‌మెంట్ స్థాయిలో, 19,977 గృహాలు బిలో బేస్‌మెంట్ స్థాయిలో, 2,103 గృహాలు రూఫ్ స్థాయిలో, 2,585 గృహాలు రూఫ్ కాస్ట్ స్థాయిలో వుండగా 10,757 గృహాలు పూర్తి కాగా ఇంకా 859 గృహాలు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. గృహ నిర్మాణ నాణ్యతలో సంబంధిత డీఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బాధ్యత తీసుకోవాలన్నారు. ఆత్మకూరులో ఆప్షన్ 3 కింద 3,700 గృహాలు మంజూరయ్యాయని వెంటనే గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని డీఈ, ఏఈలను ఆదేశించారు. లే అవుట్లలో వసతులు కల్పించి లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. చాగలమర్రి, శిరివెళ్ల, ఆత్మకూరు అర్బన్, బేతంచెర్ల మండలాల్లో గృహ నిర్మాణం చాలా వెనుకబడి ఉందని, హౌసింగ్ అధికారులు, నియోజకవర్గ స్పెషల్ అధికారులు, లేఅవుట్ల స్పెషల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న లేఅవుట్లలో నీరు, ఇసుక, సిమెంటు, స్టీల్ కొరత లేకుండా అన్ని రకాల సదుపాయాలు సమకూర్చాలన్నారు. సమీక్షా సమావేశంలో హౌసింగ్ ఈఈ మాధవరావు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, లేఅవుట్ స్పెషల్ ఆఫీసర్లు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అధికారులు, హౌసింగ్ డీఈలు, ఏఈలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు

ఆలూరు: కార్యకర్తలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆస్పరి మండలం జొహరాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రాంబాబు, జాఫర్ గత నెల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షల (ఒక్కో కుటుంబానికి రూ. లక్ష చొప్పున) ఆర్థిక సాయాన్ని బుధవారం ఆలూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కో-ఆర్డినేటర్లు ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య సమక్షంలో మంత్రి గుమ్మనూరు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మంత్రి సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనిదినాలు పెంచాలి

- సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సభ్యులకు అధికారుల విన్నపం



మాట్లాడుతున్న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ మెంబర్ అశోక్ పంకజ్

కర్నూలు(సెంట్రల్): ఆదోని డివిజన్‌లోని కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద కల్పించే పని దినాలను 100 నుంచి 150కు పెంచాలని సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సభ్యులకు జిల్లా అధికారులు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధ్యక్షతన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ అశోక్ పంకజ్, ప్రొఫెసర్ సోనాల్డ్ దేశాయ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ చిన్న తాతయ్య, జాయింట్ కమిషనర్ శివప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఉపాధి పనుల్లో ప్రజలు కోరుకుంటున్న మార్పులు, చేర్పులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులు పెడితే ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ సూచించారు. ఆదోని డివిజన్‌లోని కౌతాళం మండలం ఎరిగేరి, హల్వి, అగస్తనూరులలో ప్రజలు వలస వెళ్తున్నారని, ఇక్కడ పని దినాలను 100 నుంచి 150కు పెంచితే వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇదే మండలంలోని కెనాల్ పక్కన ఉన్న వల్లూరులో ప్రజలు ఉపాధి పనులకు రావడంలేదని, ఇలాంటి గ్రామాల్లో పనిదినాలు 100రోజులు ఉన్నా సరిపోతుందన్నారు. కాల్వల్లో పూడిక తీత, రహదారుల పక్కన పొదలను కొట్టించడం, రోడ్డు విస్తరణ పనులు చేస్తే మంచిదని, వాటిని ప్రజల అవసరాల కోసం కూడా వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉపాధిలో ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులు పనులు చేసుకునేలా ఉందని, దానిని 10 ఎకరాలకు మార్చితే మంచిదన్నారు. అనంతరం ఎంపవర్డ్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ అశోక్ పంకజ్, ప్రొఫెసర్ సోనాల్డ్ దేశాయ్ మాట్లాడుతూ..క్షేత్రస్థాయిలో ప్రజలు కోరుకుంటున్న మార్పులను చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశానికి ముందు సునయన ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సభ్యులు తిలకించారు. జిల్లాలోని నీటి వనరులు ఎలా ఉన్నాయని, పంటలు బాగా పండుతున్నాయా అన్న విషయాలను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా నమ్మాళ్వార్ పరమపద ఉత్సవం

ఆళ్లగడ్డ: దిగువ అహోబిల క్షేత్రంలో బుధవారం నమ్మాళ్వార్ పరమపద ఉత్సవం వైభవంగా నిర్వహించారు. వేకువ జామునే మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వాముల ఉత్సవమూర్తులకు నవకళశ స్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. రాత్రి ఉత్సవ మూర్తులను పూలపల్లకీలో కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు.



పల్లకీలో ఊరేగుతున్న ప్రహ్లాదవరదుడు

ఢిల్లీకి జెడ్పీ చైర్మన్



కర్నూలు(అర్బన్): భారత ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి బుధవారం ఢిల్లీకి వెళ్లారు. రెండు రోజుల పాటు జరగనున్న వర్క్‌షాప్‌నకు రాష్ట్రంలోని నలుగురు జెడ్పీ చైర్మన్లు, ఐదుగురు జెడ్పీ సీఈఓలు, ఒక ఎంపీపీ, ఇద్దరు ఎంపీడీఓలు హాజరుకానున్నారు. బ్లాక్ పంచాయత్ డెవలప్‌మెంట్ ప్లాన్ (బీపీడీపీ), డిస్ట్రిక్ట్ పంచాయత్ డెవలప్‌మెంట్ ప్లాన్ (డీపీడీపీ) రూపకల్పనపై వర్క్‌షాప్‌లో అవగాహన కల్పించనున్నారు.

స్కిల్ హబ్‌ల్లో నిరుద్యోగులకు శిక్షణ

కర్నూలు సిటీ: స్కిల్ హబ్‌ల్లో నిరుద్యోగ యువతి, యువకులకు 16 కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక హబ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. వీటిలో శిక్షణ పొందేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. పూర్తి వివరాలకు 9676141731, 8500783459, 9177413642 నంబర్లను సంప్రదించాలన్నారు.

ముగ్గురు న్యాయవాదుల నియామకం




శ్రీకొండ మనోహర్ ఎం.శివరామచంద్రరావు

కర్నూలు(లీగల్): న్యాయవాదులను నియమించు కోలేని పేదల వాదనలు వినిపించేందుకు ప్రభుత్వం ముగ్గురు న్యాయవాదులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ (డిఫెన్స్)గా శ్రీకొండ మనోహర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ డిఫెన్స్‌గా ఎం.శివరామచంద్ర రావు, సహాయ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా న్యాయవాది ఎ.సులోచనలను నియమించింది. వీరి పదవీ కాలం రెండేళ్లు. వివిధ న్యాయస్థానాల్లో నిరుపేదల తరపు న డిఫెన్స్ న్యాయ సహాయం అందిస్తారు. న్యాయవాదుల నియామకంపై బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఆర్.కృష్ణ, కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా, అసోసియేషన్ ప్రధా న కార్యదర్శి కాటం రంగడు, న్యాయవాదులు వై.ప్రకాష్‌రెడ్డి, ఎం.ఎస్.రెడ్డి, సురేష్, అన్నపూర్ణారెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సింగోటం పిలుస్తోంది!

- ఈనెల 15 నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు
- జిల్లా నుంచి వేలాదిగా వెళ్లనున్న భక్తులు
- కృష్ణానదిలో ప్రయాణంపై ఆంక్షలు
- ఆందోళనలో భక్తులు

పగిడ్యాల: సింగోటం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూలు జిల్లాలో వెలసిన ఈ స్వామిని దర్శించుకునేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి వేలాది మంది భక్తులు తరలివెళ్లనున్నారు. దాదాపు ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఈనెల 16న కల్యాణోత్సవం, 17న ప్రభోత్సవం, 18న రథోత్సవం, 19న తెప్పోత్సవం నిర్వహిస్తారు. ప్రతి ఏటా శ్రీశైలం బ్యాక్‌వాటర్ మీదుగా ఇక్కడి భక్తులు ఇంజన్ బోట్లలో తరలి వెళ్లి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం అనాదిగా వస్తుంది. ఈ నేపథ్యంలో మూర్వకొండ, అర్లపాడ్ ఘాట్‌ల వద్ద సందడి మొదలైంది.

నదిలో ప్రయాణానికే మొగ్గు

కృష్ణానది అవతల వైపు ఉన్న సింగోటానికి వెళ్లేందుకు చాలా మంది భక్తులు బస్సు మార్గం కంటే నది ప్రయాణానికే మొగ్గుచూపుతున్నారు. పగిడ్యాల, పాములపాడు, జూపాడుబంగ్లా, ఆత్మకూరు, శ్రీశైలం, నందికొట్కూరు తదితర ప్రాంతాల నుంచి సరైన బస్సు సౌకర్యం లేదు. కర్నూలుకు వెళ్లి అటు నుంచి మహబూబ్‌నగర్ మీదుగా సింగోటం వెళ్లాలి. దాదాపు ఐదారుగంటలు ప్రయాణమవుతుంది. అదే కృష్ణానది మీదుగా బోటులో అయితే రెండు గంటల్లో సింగోటం చేరుకుంటామని, సమయం, డబ్బు కూడా ఆదా అవుతుందని భక్తులు చెబుతున్నారు. అయితే, బోట్లలో ప్రయాణం ప్రమాదకరం కావడంతో అధికారులు నిషేధం విధించారు. సింగోటం జాతర నేపథ్యంలో నదిలో ప్రయాణానికి అనుమతించాలని భక్తులు కోరుతున్నారు. కాగా నదిలో బోట్లు తిప్పేందుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తేనే తాము అనుమతిస్తామని ముచ్చుమర్రి సబ్‌ఇన్‌స్పెక్టర్ నాగార్జున తెలిపారు.



మంచాలకట్ట ఘాట్ నుంచి మూర్వకొండ ఘాట్‌కు వచ్చిన తెలంగాణ ఇంజన్ బోట్

మొదటి నుంచి వస్తున్న సంప్రదాయం



ప్రతి ఏటా సింగోటం జాతరకు జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వెళ్తారు. సరైన బస్సు మార్గం లేకపోవడంతో చాలా మంది నందికొట్కూరు నుంచి నెహ్రూనగర్ చేరుకుని మూర్వకొండ, అర్లపాడు ఘాట్‌ల ద్వారా ఇంజన్ బోట్లలో వెళ్తారు. 2008 నుంచి రెవెన్యూ అధికారులు బోటుకు 20 మంది చొప్పున లైఫ్ జాకెట్లు ఇచ్చి అనుమతి ఇచ్చేవారు. ఈ సారి అధికారులు ఇంకా అనుమతి ఇవ్వలేదు.

– శ్రీనివాసులు, ఘాట్ నిర్వాహకుడు, నెహ్రూనగర్

దూరం, చార్జీల భారం తగ్గుతుంది



2007లో సింగోటం జాతరకు వెళ్లేటప్పుడు కృష్ణానదిలో పడవ మునిగి చాలామంది చనిపోయారు. ఆ తర్వాత నుంచి రెవెన్యూ, అగ్నిమాపక, నీటిపారుదల, మత్స్యశాఖ, పోలీస్ సిబ్బంది ఘాట్ల వద్ద దగ్గరుండి జాతరకు పంపించే వాళ్లు. బస్సు ప్రయాణం అయితే సాయంత్రమైన సింగోటం చేరుకోలేం. నది ప్రయాణం అయితే రెండు గంటల్లో జాతరకు చేరుకుంటాం. చార్జీ కూడా చాలా తక్కువ. అధికారులు స్పందించి బోట్లలో ప్రయాణానికి అనుమతించాలి – తిక్కస్వామి, నెహ్రూనగర్, భక్తుడు

బంగారం రికవరీ

కొత్తపల్లి: మండలంలోని ఎం. లింగాపురం గ్రామంలో కట్ట హుస్సేన్ రెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగను పోలీసులు గుర్తించి బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌జీ సుబ్రమణ్యం బుధవారం విలేకరులకు చోరీ కేసు వివరాలు వెల్లడించారు. డిసెంబర్ 31వ తేదీ మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి హుస్సేన్ రెడ్డి పనిమీద బయటకు వెళ్లాడు. గమనించిన అదే గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలుడు ఇంట్లో చొరబడి 8 తులాల బంగారు ఆభరణాలు, రూ. 2500 నగదు ఎత్తుకెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చిన హుస్సేన్‌రెడ్డి చోరీ జరిగిన విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానంతో బాలుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. చోరీ చేసినట్లు అంగీకరించడంతో బంగారు ఆభరణాలు, నగదును రికవరీ చేసి బాలుడిని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

భర్త చేతిలో భార్య దారుణహత్య

- అనాథలైన ఇద్దరు పిల్లలు

పత్తికొండటౌన్: పట్టణంలో బుధవారం పట్టపగలే దారుణం చోటుచేసుకుంది. ఆదోని రోడ్డులోని హీరో షోరూం సమీపంలో డాబా వద్ద గౌరీబాయి అలియాస్ గౌరమ్మ(33) అనే మహిళ భర్త రెడ్యానాయక్ చేతిలో దారుణహత్యకు గురైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను కూరగాయల కత్తితో పొడిచి హత్యచేసి భర్త పరారయ్యాడు. దీంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు.. తుగ్గలి మండలం ఎల్లమ్మగుట్టతండాకు చెందిన గౌరీబాయిని పత్తికొండ మండలం జీవరాళ్లమల తండాకు చెందిన నెనావత్ రెడ్యానాయక్‌కు ఇచ్చి 2005లో వివాహం చేశారు. వీరికి 9, 8 తరగతి చదివే ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాల వల్ల భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో రెండేళ్ల క్రితం గౌరీబాయి భర్తను, పిల్లలను వదిలి వెళ్లిపోయి ప్రొద్దుటూరులో బంధువుల వద్ద ఉంటూ రొట్టెల చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. భార్య వదిలివెళ్లిన తర్వాత రెడ్యానాయక్ పత్తికొండ పట్టణం ఆదోనిరోడ్డులో డాబా పెట్టుకుని, పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. తనకు భార్య నుంచి విడాకులు కావాలని కోర్టులో పిటీషన్ దాఖలు చేశాడు. ఈ నేపథ్యవతో భార్యభర్తలు కలిసి ఉన్నపుడు జీవరాళ్లమలతండాలో రంగానాయక్ అనే వ్యక్తికి రూ.50వేలు అప్పు ఇచ్చారు. ఇద్దరూ కలిసివస్తే అప్పు చెల్లిస్తానని రంగానాయక్ చెప్పడంతో గౌరీబాయి బుధవారం పత్తికొండకు చేరుకుంది. డబ్బు విషయమై స్థానిక ఆదోనిరోడ్డులోని డాబా వద్ద భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఆవేశానికి లోనైన రెడ్యానాయక్ కూరగాయల కత్తితో విచక్షణారహితంగా భార్యను పొడిచి పారిపోయాడు. తీవ్ర రక్తస్రావంతో విలవిల్లాడుతున్న గౌరీబాయిని బంధువులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ మురళీమోహన్, పోలీసుసిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. తల్లి హత్యకు గురికావడం, తండ్రి హంతకుడిగా మారడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. పోస్టుమార్టం అనంతరం బంధువులు మృతదేహాన్ని జీవరాళ్లమల తండాకు తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు.



హత్యకు గురైన గౌరీబాయి

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

- ఇరువురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



మృతి చెందిన రాజశేఖర్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– నంద్యాల ఆర్ అండ్‌బీ రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి అందించిన సమాచారం మేరకు.. నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన శ్రీధర్, మహబూబ్ బాషా అనే యువకులు కోవెలకుంట్ల పట్టణ శివారులోని శిల్పకళా మందిరంలో శిల్పులుగా పనిచేస్తున్నారు. పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. దొర్నిపాడు మండలం గుండుపాపల గ్రామానికి చెందిన రాజశేఖర్(28) అనే యువకుడు వ్యవసాయ పనులు ముగించుకుని అత్తగారి ఊరైన సంజామల మండలం ఆల్వకొండ గ్రామానికి బైక్‌పై వెళుతుండగా మండలంలోని కలుగొట్ల సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు గాయపడగా అటుగా వెళుతున్న ప్రయాణికులు కోవెలకుంట్ల 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటికే రాజశేఖర్ మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రజని, మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. మహబూబ్‌బాషాను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

జేసీబీ ఢీకొని మహిళ మృతి

డోన్ రూరల్: జేసీబీ ఢీకొని మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన నరసమ్మ (59) దుర్మరణం చెందింది. మృతిరాలి బంధువులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నరసమ్మ బుధవారం రాత్రి ఇంటి ముందున్న చెత్తను దిబ్బలో వేసేందుకని రోడ్డు దాటుతుండగా కన్నపకుంట గ్రామం నుంచి డోన్‌కు వస్తున్న జేసీబీ ఢీకొంది. ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగిందని మృతురాలి కుమారుడు నాగమద్దయ్య రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా జేసీబీని అక్కడే వదిలేసి డ్రైవర్ కమలాపురం సంజీవుడు పరారయ్యాడు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతిచెందిన మనోహర్

మిడుతూరు: మొక్కజొన్న చేసుకు పురుగు మందు పిచికారీ చేయడానికి వెళ్లి ఓ కూలీ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాతపడిన ఘటన బుధవారం మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. సుంకేసుల గ్రామానికి చెందిన తెలుగు అచ్చెన్న, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు మద్దూరు మనోహర్ (23)తోపాటు చరణ్, జయరాముడు అదే గ్రామానికి చెందిన కురువ వెంకటరాముడు పొలంలో మొక్కజొన్న పైరుకు మందు పిచికారీ చేయడానికి వెళ్లారు. పక్కనే ఉన్న రైతు జేమ్స్ పొలంలో డ్రమ్ము తీసుకురావడానికి మనోహర్ వెళ్లాడు. జేమ్స్ తన చీనీ పండ్ల మొక్కలు, కంది పంటను అడవి జంతువుల నుంచి కాపాడుకునేందుకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ వైర్ తాకి విద్యుదాఘాతానికి గురై మనోహర్ అక్కడికక్కడే మృతిచెందాడు. తోటి కూలీలు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుదాకర్ రెడ్డి, ఎస్‌ఐ మారుతిశంకర్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ శాఖ అనుమతి లేకుండా పొలం చుట్టూ విద్యుత్ కనెక్షన్ ఇచ్చి తన కుమారుడి మరణానికి కారణమైన జేమ్స్‌పై చర్యలు తీసుకోవాలని మృతుని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై కేసు కొట్టివేత

నందికొట్కూరు: 5 ఏళ్ల క్రితం పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై నమోదైన కేసును నందికొట్కూరు కోర్టు కొట్టివేసింది. 2017లో బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలో హంద్రీనీవాలో ఏసన్న అనే యువకుడు పడి చనిపోయాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, అతని అనుచరులతో కలిసి ఆందోళన చేశాడు. ఆ సమయంలో తమ విధులకు ఆటంకం కలిగించారని పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ జరిపిగిన నందికొట్కూరు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ తిరుమలరావు కేసు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చినట్లు బైరెడ్డి సిద్ధార్థ తరపు న్యాయవాది బి. వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు.

మహిళ ఆత్మహత్య

బొమ్మలసత్రం: బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మ (53) నంద్యాల చిన్న చెరువులో దూకి బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. తాలూకా సీఐ మురళీ మోహన్‌రావు తెలిపిన వివరాల మేరకు.. రామలక్ష్మమ్మ గత కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతుంది. ఈనేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఆటో ఎక్కి నంద్యాల చిన్న చెరువు వద్దకు చేరుకుంది. తర్వాత నీటిలో దూకింది. కొంత సేపటి తర్వాత స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు లక్ష్మీకాంతరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పంచాయతీ కార్యదర్శి మృతి



వెంకటయ్య(ఫైల్)

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరు పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య (42) బుధవారం హఠాన్మరణం చెందారు. ఇతని స్వగ్రామం గోస్పాడు మండలం పసురపాడు. రోజూ సొంతూరి నుంచి పెద్దకంబలూరికి వచ్చి విధులు నిర్వర్తించి వెళ్లేవారు. బుధవారం ఇంటి నుంచి బయలు దేరే సమయంలో ఉన్నట్టుండి అస్వస్థకు గురై కుప్పకులాడు. కుటుంబ సభ్యులు గమనించేలోగా ప్రాణాలు వదిలాడు. రుద్రవరం ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఏఓ వరలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ హిద్రూస్, తోటి కార్యదర్శులు మృతుడికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం మృతుడి భార్య ఇందిరమ్మకు రూ.20వేలు అందించారు.